# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 27 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 338

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

ఓవైసీ లాంటివారితో దేశానికి ప్రమాదం



2లో

## ఢిల్లీ లిక్కర్ కేసులో మరో కీలక పరిణామం

కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సిబిఐ



2లో

## ఫిరాయింపుల చట్టం అపహాస్యం

సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి

# నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ భేటీ..

కేంద్రమంత్రి గడ్కరీతో
సీఎం రేవంత్ భేటీ
రోడ్ ప్రాజెక్టులపై
పవర్ పాయింట్ ప్రజంటేషన్
ఆర్ఆర్ఆర్ సహా అనేక
ప్రాజెక్టులను క్లియర్ చేయాలని వినతి

**న్యూఢిల్లీ:** రీజనల్ రింగ్ రోడ్డు సహా తెలంగాణలో రోడ్డు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సెం రేవంత్ రెడ్డి కేందరమంత్రి నితన్ గడ్కరిని కోరారు. అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరగా క్లీయర్ చేయాలని కోరారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బుధవారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన అంశాలను మీడియాకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ క్రమంలో ఆర్ఆర్ఆర్ పై తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. తెలంగాణకు కావాల్సిన రోడ్ల నెట్‌వర్క్‌కు కావాల్సిన అంశాలపై ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణలో రోడ్డు నెట్‌వర్క్ విస్తరణ పైన సుదీర్ఘంగా నితిన్ గడ్కరీతో చర్చించామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టే అంశంపై చర్చించామన్నారు. విజయవాడ రోడ్డును ఆరు లైన్లుగా మారుస్తామని ప్రకటించారు. హైదరాబాద్ కల్వకుర్తి రోడ్డుపై చర్చించామన్నారు. వారం రోజుల్లో అన్ని శాఖలతో కలిపి మరో సమావేశం పెడతామని తెలిపారు. అన్ని శాఖల నుంచి ఒకేసారి క్లియరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ÷ఖజనల్



రింగ్ రోడ్డుపై లోతుగా చర్చించామని.. వారు దానికి అంగీకరించారని వివరించారు. విజయవాడ – హైదరాబాద్ రోడ్డుకు టెండర్లను పిలిచేందుకు అంగీకరించారని చెప్పారు. హైదరాబాద్ – కల్వకుర్తి రోడ్లు, ఇతర రోడ్లపై చర్చ జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన అన్ని సహాయక సదుపాయాలు కలిపిస్తామని నితిన్ గడ్కారీకి చెప్పామని అన్నారు. వారం రోజుల్లో హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తున్న నితిన్ గడ్కారీకి ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పలు విషయాలపై చర్చించామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రోడ్లు, భూ సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించలేదని మండిపడ్డారు. హైదరాబాద్, అమరావతి రెండు రాజధానుల మధ్య ఆరు లైన్ల రోడ్డు నిర్మిస్తున్నామని ... రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని

ప్రకటించారు. అలాగే ఎక్స్‌ప్రెస్‌వే కూడా నిర్మిస్తామని చెప్పారు. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామన్నారు. ఎన్నికలు అయిపోయాయి, రాజకీయాలు పక్కనపెట్టి

అభివృద్ధి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. చాలా రోడ్ల సమస్యలపైన ఈరోజు క్లారిటీ వచ్చిందన్నారు. ఉప్పల్ ఘట్‌కేసర్ ఫ్లై ఓవర్‌ను ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని వివరించారు.

## మేడిగడ్డ సరికాదని చెప్పినా వినలేదు

డిజైన్‌కు అనుగుణంగా సాగని నిర్మాణం

వేలకోట్లు నీటిపాలు చేశారు

తెలంగాణ జనసమితినేత కోదండరామ్ వెల్లడి



2లో

## లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా ఎన్నిక

మూజువాణి ఓటుతో రెండోసారి బాధ్యతలు

అభినందించిన ప్రధాని మోడీ, విపక్షనేత రాహుల్



2లో

## జిహెచ్ఎంసిలో కంటోన్మెంట్ విలీనం

కేంద్రానికి తెలియచేసిన సిఎస్ శాంతికుమారి



**హైదరాబాద్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సాధారణ ప్రజలు నివసించే ప్రాంతాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశారు. కంటోన్మెంట్ బోర్డుల పరిధిలోని ప్రాంతాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసే అంశంపై కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఎ.గిరిధర్ న్యూఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులతో మంగళవారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని కేంద్ర మంత్రికి తెలియజేశారు. బ్రిటిష్ పాలన నుంచి దేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర మంత్రి గిరిధర్‌ఈ సందర్భంగా తెలిపారు. అందువల్ల విలీన పక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్రాలను కోరారు. ఇందుకు స్పందించిన సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమ్మతి తెలిపిందని వివరించారు. కంటోన్మెంట్ పరిధి నుంచి సాధారణ ప్రజలు నివసించే ప్రాంతాలు(సివిల్ ఏరియా) తొలగింపు విధివిధానాల ఖరారుకు కేంద్రం ఏర్పాటుచేసిన కమిటీ రాష్ట్ర ప్రభుత్వంతో ఇంకా చర్చించలేదని తెలిపారు. విలీన పక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి పని చేస్తున్నదని చెప్పారు. మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, మున్సిపల్, కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ తీర్పు రిజర్వ్



**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు తిరుపతన్న, భుజంగరావు, ప్రణీత్‌రావు బెయిల్ పిటిషన్లపై నాంపల్లి కోర్టులో వాదనలు పూర్తయ్యాయి. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును గురువారానికి రిజర్వు చేసింది. తాము బెయిల్ పిటిషన్ వేసినప్పుడు కోర్టులో ఛార్జిషీట్ లేదని నిందితుల తరపు న్యాయవాది వాదించారు. కేసులో అరెస్టయిన 90 రోజుల్లో ఛార్జిషీట్ వేయకపోతే మ్యాండేటరీ/డిఫాల్ట్ బెయిల్ ఇవ్వొచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులు చెబుతున్నాయని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టులో ప్రస్తావించారు. 90 రోజుల్లోనే తాము ఛార్జిషీట్‌వేశామని, వివరాలు సరిగా లేవని తిప్పి పంపడంతో తిరిగి మళ్లీ వేసినట్టు పోలీసుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.

## గురుకులాల్లో భర్తీలు చేపట్టండి

హైదరాబాద్: గురుకులాల్లో ఉద్యోగాల భర్తీ డిసెండింగ్ ఆర్డర్‌లో చేపట్టాలని గురుకుల అభ్యర్థులు బుధవారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి నివాసంతో పాటు పెద్దమ్మ గుడి వద్ద భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేసారు. అక్కడ్నుంచి నాంపల్లిలోని గాంధీ భవన్‌కు చేరుకున్నారు. డిసెండింగ్ ఆర్డర్‌లో ఉద్యోగాల భర్తీ చేపట్టి, తమకు న్యాయం చేయాలని గాంధీభవన్ గేటు వద్ద నిరసనకు దిగారు. వి వాంట్ జస్టిస్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గాంధీ భవన్‌ను ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. గురుకుల అభ్యర్థుల నిరసనకు ఎమ్మెల్యే హరీష్ రావు మద్దతు ప్రకటించారు. అభ్యర్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం



గాంధీభవన్ ముట్టడించిన అభ్యర్థులు

మద్దతు ప్రకటించిన ఎమ్మెల్యే హరీష్ రావు

బాధాకరం అని హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, సీఎం ఇంటి ముందు మోకాళ్ళ మీద నిలబడి ఎన్నిసార్లు అభ్యర్థించినా అభ్యర్థుల మొర అలకించకపోవడం శోచనీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు అత్యున్నత, నాణ్యమైన రెసిడెన్షియల్‌తో కూడిన విద్యను పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గురుకులాలు ఏర్పాటు చేసింది అని మాజీ మంత్రి గుర్తు చేశారు. రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరం అని హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, సీఎం ఇంటి ముందు మోకాళ్ళ మీద నిలబడి ఎన్నిసార్లు అభ్యర్థించినా అభ్యర్థుల మొర అలకించకపోవడం శోచనీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు.



వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ
2 27-6-2024

# ఫిరాయింపుల చట్టం అపహాస్యం

**హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇవాళ సిగ్గు లేకుండా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని,సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ఇంటింటికి వెళ్లి కండువాలు కప్పుతున్నాడని సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ. పార్టీ ఫిరాయింపులు మంచిది కాదు.. దీన్ని మనం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. చట్టాన్ని మరింత బలోపేతం చేస్తాం. ఫిరాయింపు జరిగిన రోజే.. లోక్‌సభలో కానీ, రాజ్యసభలో కానీ, అసెంబ్లీలో కానీ ఆ అభ్యర్థి యొక్క సభ్యత్వం రద్దయ్యే విధంగా చట్టం తీసుకువస్తామని మొన్నటి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. పాంచ్ న్యాయ్ సూత్రాల్లో కూడా దాన్ని చేర్చారు. ప్రజలు కూడా కాంగ్రెస్ మేనిఫెస్టోను చూసి ఓట్లు వేశారు. ఓట్లు వేసిన ప్రజలను కూడా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోంది. ఇలాంటి సిగ్గుమాలిన పని కాంగ్రెస్ పార్టీ చేయకూడదు అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పష్టంగా చెబుతున్నారు. దానికి వ్యతిరేకంగా జీవన్ రెడ్డి రాజీనామాకు కూడా సిద్ధపడ్డారు అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు చట్టం ప్రకారం మేం విలీనం అవుతాం అని చెప్పారు. ఆ మేరకు సీఎల్పీని చట్టబద్ధంగా విలీనం చేశారు. కేసీఆర్ ఎలాంటి ఉల్లంఘనకు పాల్పడలేదు. మీ సభ్యులకే మీ పార్టీపై విశ్వాసం లేక 23 మంది ఎమ్మెల్యేల మెజార్టీతో విలీనం చేశారని కోర్టు చెప్పింది. ఇవాళ్నేమో సిగ్గులేకుండా ఇంటింటికి వెళ్లి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారు రేవంత్ రెడ్డి. కేసీఆర్ ఎవరికీ కండువాలు కప్పలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా నాడు బీఆర్ఎస్‌లో చేరారు అని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు.

# ఢిల్లీ లిక్కర్ కేసులో మరో కీలక పరిణామం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో మనీల్యాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి , ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా,ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది.ఆయన అరెస్ట్‌కు కోర్టు బుధవారం అనుమతించడం తో రౌస్ అవెన్యూ కోర్టు లోనే సీబీఐ అదుపు లోకి తీసుకుంది. అనంతరం న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఎదుట హాజరుపరిచిన అధికారులు ఐదు రోజుల కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో ట్రయల్ కోర్టు గత గురువారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయగా, దీనిపై ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. దిగువ న్యాయస్థానం తమ వాదనలకు తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపించింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఈడీ సమర్పించిన ఆధారాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైందని, బెయిల్ మంజూరులో



నిర్ణయం తీసుకునేటప్పుడు సమగ్ర పరిశీలన చేయలేదని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు నిర్ణయం వెలువడిన తరువాత దీనిపై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు వెలువడడంతో బుధవారం దీనిపై విచారణ చేపట్టింది.అయితే ఈ పిటిషన్‌ను తాజాగా కేజ్రీవాల్ తరఫున న్యాయవాదులు వెనక్కు తీసుకున్నారు. పిటిషన్ ఉపసంహరించుకుంటామని కేజ్రీవాల్ కోరగా, అందుకు జస్టిస్ మనోజ్‌మిశ్రా, జస్టిస్ ఎస్వీఎస్ భట్టిల ద్విసభ్య ధర్మాసనం అనుమతించింది. హైకోర్టు పూర్తిస్థాయి ఉత్తర్వులు, సిబిఐ అరెస్ట్ వంటి పరిణామాల నేపథ్యంలో సమగ్ర పిటిషన్ దాఖలు చేస్తామని కేజ్రీవాల్ తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానానికి తెలిపారు. అయితే కేజ్రీవాల్ అరెస్ట్‌కు సీబీఐకి కోర్టు అనుమతివ్వడంపై ఆయన తరఫు

న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇది అత్యంత పక్షపాతంతో కూడిన చర్యగా వ్యాఖ్యానించారు. ఇప్పటికే కేజ్రీవాల్‌ను 9 గంటల పాటు ఏప్రిల్‌లో సిబిఐ ప్రశ్నించిందని, ఆయన తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి అన్నారు. ఈ కేసు ఆగస్టు2022 నుంచి పెండింగ్‌లో ఉంది.. నన్ను సాక్షిగా పిలిచారు.. నేను హాజరయ్యాను. తొమ్మిది గంటల పాటు విచారణ జరిగింది. అప్పటి నుంచి ఒక్క నోటీస్ కూడా సిబిఐ నుంచి రాలేదు. సాక్షి నుంచి నిందితుడిగా ఎలా మారారు. ఇది చాలా దారుణం అని మండిపడ్డారు. తన వాదన వినిపిస్తూ కేజ్రీవాల్ దురుద్దేశంతో కూడిన అనవసర అరోపణలు చేస్తున్నారని సిబిఐ పేర్కొంది.

## మేడిగడ్డ సరికాదని చెప్పినా వినలేదు

**హైదరాబాద్:** మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కట్టడం మంచిది కాదని చెప్పినా గత భారాస ప్రభుత్వం పట్టించుకోలేదని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రీ ఇంజినీరింగ్‌కు ముందు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సుజల స్రవంతి పేరుతో ప్రారంభించారు. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు సరికాదని చెప్పినా భారాస ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. ఆర్థికపరమైన అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని క్యాట్ చెప్పింది. మేడిగడ్డ డిజైన్ ఒకటైతే.. నిర్మాణం మరో రకంగా చేయడంతో కుంగిపోయింది. ప్రాజెక్టు నిర్మాణ మెటీరియల్ సక్రమంగా లేదు, నిర్వహణ కూడా సరిగా లేదని డ్యాం సేఫ్టీ అధికారులు చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి కాలువల ద్వారా నీరు తీసుకురాగలిగితే గతంలో ఖర్చు చేసిన నిధులకు సార్థకత దక్కుతుంది. తుమ్మిడిహట్టిని పరిశీలించాలని ప్రభుత్వం, కమిషన్‌ను కోరాం. ఇంజినీర్ల సూచనలను గత ప్రభుత్వం బేఖాతరు చేసింది. మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి. విచారణ కమిషన్ వేయాలని కోరిందే భారాస. కమిషన్ వేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని అసెంబ్లీలో ఆ పార్టీ కోరింది. ప్రజల సొమ్మును ఏ ప్రభుత్వమైనా బాధ్యతగా ఖర్చు చేయాలి. విచారణ కమిటీని రద్దు చేయించి.. వాస్తవాలు బయటకు రాకుండా చేయాలని చూస్తున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ తమపైన ఉన్న కేసులను ఎత్తివేయాలని కోరడం బాధ్యతారాహిత్యం. భారాస పాలనలో మాపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతున్నా. బొగ్గు గనులను వేలం వేయడమంటే అది ప్రైవేటీకరణకు దారి తీస్తుంది. బొగ్గు గనులను సింగరేణికే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని కోదండరాం తెలిపారు.

## లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా ఎన్నిక

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి ఓంబిర్లా గెలుపొందారు. బుధవారం జరిగిన ఓటింగ్‌లో ఇండియా కూటమి అభ్యర్థి కె.సురేశ్‌పై ఓం బిర్లా గెలుపొందారు. మూజువాణీ ఓటుతో ఓంబిర్లా విజయం సాధించినట్లు ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రకటించారు. ఉదయం సభ ప్రారంభం కాగానే ఎన్డీయే కూటమి తరఫున లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా పేరును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదిస్తూ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని రాజ్‌నాథ్ సింగ్ సహా మంత్రులు, ఎన్డీయే ఎంపీలు బలపరిచారు. మరోవైపు ఇండియా కూటమి తరఫున కె.సురేశ్ పేరును శివసేన (యుబిటి) ఎంపీ అరవింద్ సావంత్ తీర్మానం చేశారు. దీన్ని పలువురు విపక్ష ఎంపీలు బలపర్చారు. అనంతరం స్పీకర్ పదవికి ఎన్నిక చేపట్టారు. మూజువాణీ ఓటుతో చేపట్టిన ఈ ఎన్నిక పక్రియలో ఓం బిర్లా విజేతగా నిలిచారు. స్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లాకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. అనంతరం ఓంబిర్లాను మోదీ, రాహుల్, కిరణ్ రిజుజు సాదరంగా సభాపతి స్థానం వద్దకు తీసుకెళ్లి స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. స్పీకర్ పదవికి ఈ సారి ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ప్రతిపక్షాలతో జరిపిన చర్చలు ఫలించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వాలన్న షరతుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో స్పీకర్ స్థానానికి విపక్ష ఇండియా కూటమి అభ్యర్థిని నిలిపింది. ఇండియా కూటమి తరఫున సీనియర్ ఎంపీ కొడికున్నిల్ సురేశ్ బరిలో నిలిచారు. దీంతో గత 50 ఏండ్లలో తొలిసారిగా, స్వతంత్ర భారత చరిత్రలో మూడోసారి లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. ఈ క్రమంలో 18వ లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి బీజేపీ ఎంపీ ఓం బిర్లా ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు. బుధవారం లోక్‌సభలో జరిగిన ఎన్నిక పక్రియలో ఇండియా కూటమి అభ్యర్థిపై మూజువాణి ఓటుతో విజయం సాధించారు. ఓం బిర్లా కోటా-బుంది లోక్‌సభ స్థానం నుంచి మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2019లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మోదీ 2.0 ప్రభుత్వంలో లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసారి కూడా ఉన్‌డిఎ ఆయనను లోక్‌సభ స్పీకర్ అభ్యర్థిగా ప్రకటించింది. ఇతర పార్టీలు కూడా బయటి నుండి ఓం బిర్లాకు మద్దతు పలికారు. దీంతో ఓం బిర్లా రెండవసారి లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఓం బిర్లా వరుసగా రెండు పర్యాయాలు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన రాజస్థాన్‌కు చెందిన బలరాం జాఖర్‌తో సమానంగా నిలిచి చరిత్ర సృష్టించారు. ఇప్పటి వరకు లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండుసార్లు ఎన్నికై తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న ఏకైక లోక్‌సభ స్పీకర్‌గా బలరాం జాఖర్ నిలిచారు.

# ఓవైసీ లాంటివారితో దేశానికి ప్రమాదం

**హైదరాబాద్త:** పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం సందర్భంగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత కొంపెల్ల మాధవీలత తీవ్రంగా స్పందించారు. ఒవైసీ పార్లమెంట్‌లో అల్లాహుఅక్బర్ తో పాటు జై పాలస్తీన్ అనడంపై ఆమె తీవ్ర అభ్యంతరం తెలిపారు. అల్లా అన్న నోటితో జై పాలస్తీన్ అనడం ఏంటని.. అతని ఉద్దేశాలు ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి వారి వల్ల దేశ భద్రతకు ముప్పు అని.. తక్షణం ఇతణ్ని విచారణ చేయాల్సి ఉందని ఓ వీడియోను విడుదల చేశారు.

'పార్లమెంటులో జై బోలో భారత్ మాతాకీ అనాల్సిన నోటి నుంచి జై పాలస్తీనా అనే మాట ఆయన నోటి నుంచి వచ్చిందంటే.. దేశానికే దౌర్భాగ్యం. ఇలాంటివారిని ప్రోత్సహిస్తున్నందుకు 130 కోట్ల మంది భారతీయులు మనల్ని మనమే ప్రశ్నించుకోవాలి. రజాకార్ల నుంచి వచ్చి.. వారిని చంపి వారి ఎంఐఎం పార్టీని కైవసం చేసుకొని గత 40 నుంచి 50 ఏళ్ల నుంచి తెలంగాణలో పాలన చేస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీ





అధికారంలోకి వస్తుందో.. వీరికి మద్దతివ్వడం ఆనవాయితీగా వస్తోందని మండిపడ్డారు. తమ్ముడు చిటికె వేస్తాడు.. 15 నిమిషాల్లో ఖబడ్దార్ ఈ దేశాన్ని శ్మశానం చేస్తా అంటాడు. నేను ఆపాను కాబట్టే అతను ఆగుతున్నాడు.. లేదంటే ఏం చేస్తాడో చూస్కోండి అని అన్న అంటాడు. వీరు ఏం చేస్తారు? జై పాలస్తీన్ అని పార్లమెంట్‌లో అన్నప్పుడు వీరి మనస్తత్వం ఏంటి? ఇలాంటి వారిని మనం పార్లమెంట్‌లోకి తీసుకొచ్చి కూర్చోబెడుతున్నాం. ప్రశ్నించేవారు లేరా? ఈ దేశ సంరక్షణ ఏ దిశగా వెళ్తోంది. 130 కోట్ల జనాభా మధ్యలో ఇలాంటి వారు మనతో ఉండడమే కాకుండా.. అక్రమ మార్గంలో ప్రజాప్రతినిధులై పార్లమెంటులో కూర్చొంటే దానికి రక్షణ ఎక్కడుంది? వీరు హమాస్ వాళ్లా? వారి కోసం పని చేస్తారా? హమాస్ ఆశయాలను భారత దేశంలో అమలు చేయడానికో.. లేదా వారిని సంతృప్తి పర్చడం కోసం ఇక్కడ పని చేస్తున్నారా? ఏ దేశంలో అయినా పుట్టిన వారు అదే తన మాతృభాష, మాతృభూమిని పాటించి, అదే తన జీవిత లక్ష్యం అని అనుకుంటారు. వీరి ఉద్దేశం అలా లేదు. వీరెప్పుడూ పేరు, ప్రఖ్యాతి, డబ్బు కోసం పరితపించే వికృతమైన వ్యక్తులు వీరు. భగవత్ నామం అల్లా అని పేరు చెప్పి.. జై పాలస్తీన్ అన్నాడంటే.. అతని మనస్సులోంచి వచ్చిన మాటలివి. అతను ఎందుకు ఈ మాటలు అన్నాడు. కచ్చితంగా జాతీయ భద్రతా మండలి వారు ఒవైసీని కూర్చోబెట్టి ప్రశ్నించాలి. అతని మదిలో ఏ ఆలోచనలు ఉన్నాయో తేల్చాలి. ఇప్పుడు కనుక మనం మేల్కోకపోతే, పరిష్కరించుకోకపోతే.. ఈ భారత్ శత్రువులకు పాలు పోసి పెంచినట్లు అవుతుంది' అని మాధవీ లత అన్నారు.

# రైతులు లాభదాయకమైన పంటలపై దృష్టి పెట్టాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.



వేగుచుక్క న్యూస్,కామారెడ్డి,జూన్ 26:

వ్యయసాయంతో పాటు లాభదాయకమైన పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, ఆయిల్ ఫార్మ్ తోటల పెంపకం వంటి వాటిపై రైతులు దృష్టిసారించి ఆర్థిక వృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం స్థానిక కళాభారతి ఆడిటోరియం లో డెయిరీ టెక్నాలజీ కళాశాల, హైదరాబాద్ కు చెందిన జాతీయ మాంస పరిశోధన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా ను కలెక్టర్ ప్రారంభించారు. అక్కడ పశు సంవర్ధక శాఖ, ఉద్యాన, మత్స్య శాఖ, విజయ డెయిరీ, పరిశ్రమల శాఖ, నాబార్డు తదితర సంస్థలు తమ ఉత్పత్తులు, పరికరాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను, ప్రైవేట్ విత్తనాలు, ఎరువుల కంపెనీలు, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్ల స్టాల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రైతుల ఆదాయ వనరులను మెరుగుపరచాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా వివిధ పథకాలు అమలు చేస్తూ సబ్సిడీ అందిస్తున్నదని అన్నారు. బ్యాంకర్లు ఉదారంగా రుణాలు అందించి రైతులకు ఇతోధికంగా చేయూత నివ్వాలని కోరారు. కిసాన్ మేళ ల ద్వారా రైతులకు అధునాత వ్యవసాయంలో సూచనలు, మెళకువలు, సాంకేతిక సలహాలు, శాస్త్ర పరిశోధన ఫలాలు అందిస్తూ అవగాహన కలిగిస్తున్నదని, రైతులు వాటిని ఆకళింపు చేసుకొని సంపద పెంపొందించుకునే దిశగా ఎదగాలని కోరారు. పాల ఉత్పత్తి, పశు సంపద పెరగాలంటే నాణ్యమైన మేలుజాతి పాడిపశువుల ఎంపిక చేసుకోవాలన్నారు,. ఆడదూడలకు ఎద సూది (వీర్యం) ఇవ్వడం ద్వారా ఆడ దూడలే పుడతాయని ఇట్టి విషయమై పశు సంవర్ధధక శాఖాధికారులను సంప్రదించవలసినదిగా కలెక్టర్ రైతులకు సూచించారు.

జాతీయ మాంస పరిశోధన సంస్థ డైరెక్టర్ బర్బుద్దే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలలో అవగాహన నిమిత్తం కిసాన్ మేళాలు నిర్వహిస్తున్నదని అన్నారు. జంతు వ్యర్థ పదార్థాల నిర్వహణ, సాంకేతికతలపై ఔత్సాహికులను ప్రోత్సహిస్తూ శిక్షణ ఇస్తున్నామన్నారు. తెలంగాణ లో మాంసానికి మంచి డిమాండ్ ఉందని, ఆ దిశగా రైతులు గొర్రెలు, కోళ్లు, చేపల పెంపకం పై దృష్టిపెట్టాలని అన్నారు.

కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ శరత్ చంద్ర మాట్లాడుతూ పరిశోధనా ఫలాలు రైతు సోదరులకు అందించాలనే ఉద్దేశ్యంతో కిసాన్ మేళా ఏర్పాటు చేశామన్నారు. వివిధ శాఖల స్టాల్స్ ద్వారా ప్రేరణ కల్పిస్తున్నామని, పాలు , పాల ఉత్పత్తి ప్రాసెసింగ్ ద్వారా ఆదాయం ఎలా మెరుగుపరచుకోవాలో అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్, యెన్ ఆర్ ఏం ఐ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ బస్వారెడ్డి , జిల్లా పశు సంవర్ధకః శాఖాధికారి సింహా రావు, జిల్లా వ్యవసాయాధికారి

భాగ్యలక్ష్మి, విజయ డైయిరీ డిప్యూటీ డైరెక్టర్ నంద కుమారి, కళాశాల విద్యార్థులు, రైతులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.




# జిజిహెచ్ లో నర్సింగ్ బ్యాచ్ కి "బ్యాడ్జింగ్" వేడుక.

**- పాల్గొన్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్.**

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 26:

జిజిహెచ్ లో 2024 నర్సింగ్ బ్యాచ్ కి బుధవారం ఘనంగా "బ్యాడ్జింగ్" వేడుక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరా, డాక్టర్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ, నర్సింగ్ సిబ్బంది ఒక ప్రక్క కాంట్రాక్ట్ లో పని చేస్తూనే మరో ప్రక్క చదువుతూ ఎంతో కష్టపడి మీరు సాధించుకున్న మీ ఉద్యోగానికి సరియైన సార్థకత చేకూరాలంటే మీరు మీ విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. రోగులతో సరియైన సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ, వినయశీలురై భవిష్యత్తులో మరింత అభివృద్ధిని సాధించాలని సూచించారు. నర్సింగ్ వృత్తి చాలా బాధ్యతాయుతమైనదని, మానవతా విలువలతో కూడుకున్నదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం లో మన జిజిహెచ్ నిజామాబాద్ లో ని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులలో 98 శాతం మంది ఉత్తీర్ణత సాధించి రెగ్యులర్ అవడం గర్వకారణం గా ఉంది అని అన్నారు. అనంతరం ప్రతి ఒక్క నర్సింగ్ అధికారికి వారి వృత్తికి చిహ్నమైన బ్యాడ్జిలను అందజేశారుఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.





## వర్షాభావ పరిస్థితులపై అధ్యయనం చేయాలి

న్యూఢిల్లీ: వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలిసివచ్చినా ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ది చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృధాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయటపడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా...ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధా నించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించాలి.

# "డీవీ కృష్ణ" ఆశయాల సాధనకు పోరాడాలి.











**ఆదర్శం, అలుపెరుగని కమ్యూనిస్టు నేత డీవీకే.**

**సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ పిలుపు.**

**ఘనంగా డీవీకే స్మారక స్థూపం ఆవిష్కరణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 26**

విప్లవోద్యమ నాయకుడు, ఆదర్శ కమ్యూనిస్టు నేత, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కడీవీ కృష్ణ ఆశయాల సాధనకు ఐక్యంగా పోరాడాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ పిలుపునిచ్చారు.

సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రేడియో స్టేషన్ ఎదురుగా డీవీకే నగర్ లో నిర్మించిన డీవీకే స్మారక స్థూపం బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ముందుగా రేడియో స్టేషన్ నుండి సభాస్థలి వరకు భారీర్యాలీ నిర్వహించారు. సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ జెండా ఆవిష్కరణ చేశారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ డీవీ కృష్ణ స్మారక స్థూపాన్ని ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డి.వి కృష్ణ ఆదర్శ కమ్యూనిస్టు అని, విప్లవోద్యమానికి, ఆయన చేసిన కృషి అజరామరం అని కొనియాడారు. డీవీకే సైద్దాంతిక, రాజకీయ రంగాలన్నింటినీ నిశితంగా పరిశీలన చేసి సరైన సిద్ధాంతం కోసం మొక్కవోని పోరాటం చేశాడన్నారు. 50 సంవత్సరాల విప్లవ జీవితమంతా విప్లవోద్యమం నిర్మించడానికి, అతివాదాన్ని మితవాదాన్ని వ్యతిరేకించి నిలబడ్డాడని అన్నారు. పార్టీని సరైన పంథాలో తీసిదిద్దడానికి కృషి చేశాడన్నారు. డీవీ కృష్ణ ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు ఉన్నతమైనవన్నారు. ఆయన ఆశయాల కొనసాగింపే ఆయనకు మనమిచ్చే వినమ్ర విప్లవాంజలి అవుతుందన్నారు.సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ,

దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికత్వం ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితి ఉన్నదన్నారు. ముఖ్యంగా ఒకప్పుడు నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన, విప్లవోద్యమాలను అక్కున చేర్చుకున్న ఉత్తర తెలంగాణ, పార్లమెంటు ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీ ఎంపీలను గెలిపించడం బాధాకరమన్నారు.

మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం పరీక్ష పేపర్లను లీకులు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల జీవితాలతో ఆటలాడుకుంటున్న దన్నారుపాలకవర్గాలు ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ప్రజావ్యతిరేక చర్యలను అవలంబిస్తుం దన్నారు.ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయన్నారు. ఈ పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాల వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. ప్రజా ఉద్యమాలతో పాలకవర్గాల మెడలు వంచడమే డీవీకేకు నిజమైన నివాళి అవుతుందన్నారు.కార్యక్రమంలో ఓపీడీఆర్ జాతీయ అధ్యక్షులు భాస్కర్ రావు, న్యూడెమోక్రసీ జాతీయ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కే.యాదగిరి, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే.రాంచందర్, కే. రమ, వి.ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.నరేందర్, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు బి.దేవారాం, ఎం.వెంకన్న, డీ.రాజేశ్వర్, అల్లోట్ రవీందర్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి, పార్టీ జిల్లా నాయకులు ఎం.ముత్తెన్న, సాయగౌడ్, కే.గంగాధర్, బి.మల్లేష్, సురేష్, గంగాధర్, కిషన్, మురళి, రమేష్, సత్తెక్క, కిషన్, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో జీవితం అంతం చేసుకోవద్దు.

## - యువతకు ఎస్పీ సింధు శర్మ పిలుపు.





**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, జూన్ 25:**

యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని సందీపని జూనియర్ కళాశాల వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మదకద్ర వ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ సింధు శర్మ జండా ఊపి ప్రారంభించారు. కొత్త బస్టాండ్ నుంచి ర్యాలీ నిజాంసాగర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని సూచించారు. విద్యార్థులు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. డ్రగ్స్ కు అలవాటు పడితే విద్యార్థులకు భవిష్యత్తు ఉండదని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలు స్వీకరించిన, రవాణా చేసిన, విక్రయాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా వారిపై తల్లిదండ్రులు, అధ్యాపకులు దృష్టి సారించాలని చెప్పారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. మదకద్రవ్యాలను నియంత్రణ, వాటి వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మదకద్రవ్యాలు భవిష్యత్తులో వినియోగిం చబోమని అధికారులు, విద్యార్థులు ఫ్లెక్సీ పై సంతకాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, వయో వృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ అధికారి బావయ్య మదక ద్రవ్యాలను భవిష్యత్తులో వినియోగించబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కామారెడ్డి డిఎస్పి నాగేశ్వర్, సిఐలు చంద్రశేఖర్ రెడ్డి, రామన్, మిషన్ పరివర్తన కమ్యూనిటీ ఎడ్యుకేటర్స్ మోసర్ల శ్రీకాంత్ రెడ్డి, సుమన్, ఎక్సైజ్, ఐసిడిఎస్ అధికారులు, ఎస్సైలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.




# బ్లడ్ క్యాన్సర్" పై ఆందోళన వద్దు.




**అధునాతన వైద్యం అందుబాటులో ఉంది.**

**యశోద హాస్పిటల్ సీనియర్ వైద్యులు గణేష్ జైషేత్వాల్ వెల్లడి**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 26:**

ఇటీవల కాలంలో ప్రజల్లో ప్రతి ఒక్కరిలో బ్లడ్ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువయ్యారని, కానీ వ్యాధి పై ఆందోళన చెందవద్దని, అధునాతన వైద్యం అందుబాటులో ఉందనీ యశోద హాస్పిటల్ సీనియర్ వైద్యులు గణేష్ జైషేత్వాల్ వెల్లడించారు.

జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్, హైదరాబాద్ హైటెక్ సిటీ కి చెందిన ప్రముఖ వైద్యులు గణేష్ జై షేత్వార్ మాట్లాడారు. 2024 సంవత్సరంలో ఈ క్యాన్సర్ తో బాధపడే బ్లడ్ డిసార్డర్ బోన్ మారో ఫాస్ట్ ప్లాంట్ సక్సెస్ రేట్లు 80% నుండి 90% కు మించిపోయాయని అన్నారు. యశోద హైటెక్ సిటీ హాస్పిటల్ లో బ్లడ్ క్యాన్సర్, బ్లడ్ డిజాస్టర్ పై విజయం సాధించిన ప్రపంచ రక్త మజ్జ మార్పిడి అవగాహన మాసం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. బ్లడ్ క్యాన్సర్ రుగ్మతలు పూర్తిగా నయం చేయడమే కాకుండా ఈ చికిత్స ద్వారా సాధారణ రోగుల ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన తెలిపారు. అదేవిధంగా ఈ బ్లడ్ క్యాన్సర్ ను ద్రవ క్యాన్సర్ అనే పేరుతో కూడా పిలవబడడం జరుగుతుందన్నారు. ఇందులో లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా వంటి వివిధ రకాల క్యాన్సర్లు ఇలాంటివి ఉన్నాయని ఆయన వివరించారు. మన భారత దేశంలో తెలంగాణలో బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుందని అన్నారు. దీనికి కారణం ఆధునిక నాగరికతతో సహా అనేక కారణాలు ఉన్నాయని అన్నారు. బ్లడ్ క్యాన్సర్ పై అవగాహన లేకపోవడానికి కారణం ప్రజల్లో చైతన్యం లేకపోవడమేనని అన్నారు. బ్లడ్ క్యాన్సర్, బోన్ క్యాన్సర్లలో అనేక రకమైనటువంటి వ్యాధులతో ఎంతోమంది క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నారని, వారందరికీ శాశ్వత పరిష్కారం కోసం యశోద హైటెక్ సిటీ యాజమాన్యం అండగా నిలుస్తుందన్నారు. ఇలా ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టిన ఘనత తమదని అన్నారు. అదేవిధంగా తమ ఆసుపత్రిలో పేద ప్రజలకు క్యాన్సర్ తో బాధపడే వారికి కూడా ప్రత్యేక వైద్య సదుపాయాలు రాయితీ కూడా అందిస్తామన్నారు. దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న బెడ్ క్యాన్సర్లు నియంత్రించేనేందుకు యశోద హాస్పిటల్ వైద్యం అందుబాటులో ఉందని ఆయన వెల్లడించారు.




# నేడు కల్కి 2898 ఏడి విడుదల



గతంలో ఏ సినిమాకు రానంత క్యూరియాసిటీప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్ కాంబినేషన్ లో వస్తున్న 'కల్కి 2898 ఏడి' నేటి ఉదయం విడుదల కాబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోసినిమా ప్రియులు అందరూ ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే అనేక సంచలనాలు నమోదు చేస్తోంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ లను మించి ఈ మూవీకి పబ్లిసిటీ వచ్చింది. ఈ సినిమాలో ప్రభాస్ తో పాటు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకోన్, దిశా పటాని లాంటి దిగ్గజ నటీనటులు వున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు ఆసక్తికరంగా ఉండటమే కాకుండా, సినిమాపై మరింత ఉత్కంఠని పెంచింది. ఈ చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సినిమా పురాణాల ఆధారంగా కల్పిత కథని తీశానని చెప్పారు. శ్రీకృష్ణ భగవానుని నిర్యాణంతో ద్వాపరయుగం తరువాత కలియుగం ప్రారంభం అవుతుంది. అమితాబ్ బచ్చన్ అశ్వద్ధామ పాత్రలో కనపడనున్నారు. ఇప్పటికే చాలామంది అశ్వద్ధామ గురించి తెలుసుకోవడానికి అంతర్జాలంలో వెతుకుతున్నారు. అడిగి తెలుసుకుంటున్నారు. కమల్ హాసన్ కలి పాత్రలో కనపడనున్నారని అంటున్నారు. ఇప్పుడు నడుస్తున్నది కలియుగం! కలి ప్రభావం గురించి భాగవతంలో వ్యాస మహర్షి చెపుతారు. పోతన గారు ఆ భాగవతాన్ని తెలుగులోకి అనువదించారు. కలి అంటే ఎవరు, అతని ప్రభావం ఎలా ఉంటుంది అనే ప్రశ్నలు ఇప్పుడున్న యువకులు తమ సందేహాల్ని అడిగి తెలుసుకుంటున్నారు. అశ్వద్ధామ పాత్ర వేసిన అమితాబ్ బచ్చన్ ఎందుకు ఒంటికి గుడ్డలు చుట్టుకొని కనపడ్డారు, మామూలుగా అశ్వద్ధామకి శ్రీకృష్ణుడు ఎందుకు శాపం ఇచ్చారు, ఇవన్నీ సందేహాలు అడుగుతున్నారు. మరి నాగ్ అశ్విన్ అశ్వద్ధామతో మొదలుపెట్టి కలియుగ అంతం ఎలా అవబోతోంది అని కూడా చూపిస్తారా, లేక ద్వాపరయుగం చివర్లో ఏమి జరిగింది, కలియుగం ఎలా మొదలైంది, ఎలా వుండబోతోంది, చివర్లో ఏమవుతుంది ఈ విషయాలను చూపిస్తారా, కథ ఎలా వుండబోతోంది అనే విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి అని అంటున్నారు. ప్రచార చిత్రాలు చూస్తే అందులో అమితాబ్ బచ్చన్ ఒక ప్రధాన పాత్రలో కనపడితే, ఇంకో ప్రధాన పాత్ర భైరవ పాత్ర అయిన ప్రభాస్. భైరవ అంటే ఈశ్వరుడు అని కూడా ఒక అర్ధం వస్తుంది. అయితే ఇక్కడ ఇంకో ఆసక్తికర అంశం ఏంటంటే, నేపాల్ దేశంలో పాండవులలో అతి బలసంపన్నుడు అయిన భీముడిని దేవుడుగా కొలుస్తారు. అక్కడ భీమునికి అనేక దేవాలయాలు వున్నాయి. అక్కడ భీముడిని భైరవుడు అని కూడా పిలుస్తారు. మరి నాగ్ అశ్విన్ తీసుకున్న భైరవ పాత్ర నేపాల్ లో పూజించే భీముడి కి స్ఫూర్తిగా ఏమైనా తీసుకున్నారా. ఇవన్నీ సినిమా చూస్తే కానీ తెలియదు.

కలియుగంలో కలి ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. కలి ఎలా ఉంటాడు అనే విషయంలో అతని వర్ణన కూడా చాలా ఏహ్యంగా ఉంటుంది. పురాణాల్లోనూ కలియుగంలో ప్రజలు ఎలా ఉండబోతున్నారు, ఎటువంటి పరిస్థితులు ఎదురవుతాయి అనే విషయాల గురించి వ్యాస మహర్షి చెప్పారు. కలియుగం అంతం అవుతున్న కొద్దీ, సమాజంలో అధర్మం పూర్తిగా నశిస్తుంది, మానవుని ఆయుః ప్రమాణాలు పూర్తిగా తగ్గిపోతాయి, దోపిడీలు, దొంగతనాలు, బలవంతుడిదే రాజ్యం అనే విధంగా ఉంటుంది అని చెప్పారు. తండ్రి, కుమారుడు ఇద్దరూ ఒకే అమ్మాయిని వివాహం చేసుకునే స్థితికి వస్తుంది, అంటే అధర్మం అంతగా ప్రబలుతుంది అని చెప్పారు వ్యాస మహర్షి. ధర్మం అనేది పూర్తిగా నశించిపోయిన శంభాలా అనే గ్రామంలో రోజు విష్ణుయశుడు, సుమతి అనే దంపతులకు కల్కి అవతారంగా భగవానుడు జన్మిస్తానని చెబుతారు. ఇప్పుడు 'కల్కి 2898 ఏడి' అని పేరు పెట్టిన దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రభాస్ ని ఏవిధంగా చూపించబోతున్నారు అనేది ఆసక్తికరం. కాశీకి పురాణాల్లో ఎంతో ప్రత్యేకత వుంది. ఈ నగరం గురించి చాలా గొప్పగా చెపుతారు. యుగాంతం అయిపోయి ప్రళయం వచ్చినప్పుడు, ప్రపంచం అంతా నీటితో మునిగిపోయి, చిమ్మ చీకటితో నిండి ఉంటే, ఒక్క కాశీ నగరం మాత్రం చెక్కు చెదరకుండా ఉంటుంది .

## నాగ్ అశ్విన్‌ల అసాధారణ ప్రతిభావంతుడు



ఆయన చిత్రాల తీరు చూస్తేనే అర్థం అవుతుందిసాధారణంగా కనిపించే చాలామంది వ్యక్తుల్లో అసాధారణ ప్రతిభ దాగి ఉంటుందని ..దర్శకుడు నాగ్ అశ్విన్‌ను ఉద్దేశించి నటుడు కమల్ హాసన్ చెప్పిన మాటలివి. సామాన్యుడిగా కనిపించినా అసాధారణ ప్రతిభ అశ్విన్ సొంతం. రూ.4 వేల రెమ్యూనరేషన్ తీసుకునే పరిస్థితి నుంచి రూ.600 కోట్ల బడ్జెట్‌తో సినిమా తెరకెక్కించే స్థాయికి చేరుకున్న ఆయన ప్రయాణం ఆసక్తికరం. 'కల్కి 2898 ఏడీ' గురువారం విడుదల సందర్భంగా కొన్ని ఆసక్తికర విషయాలు మనముందున్నాయి. అశ్విన్ మితభాషి అయినా.. పనుల్లో ఎవరూ ఊహించనంత చురుగ్గా ఉంటారు. ఆ చొరవే విద్యార్థి దశలో 'స్కూల్ మ్యాగజైన్'కు ఎడిటర్‌ను చేసింది. కథనాలు, వ్యాసాలు రాయడం అప్పుడే ప్రారంభించారు. హీరో రానా దగ్గుబాటి ఈయన క్లాస్‌మేట్. నాన్న జయరామ్‌రెడ్డి, అమ్మ జయంతి.. ఇద్దరూ వైద్యులే. తల్లిదండ్రుల్లా డాక్టర్‌గా కాకుండా సినీరంగంలోకి అడుగు పెట్టారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్‌ని మొదలుపెట్టి.. దర్శకుడిగా ఎదిగి తల్లిదండ్రులు గర్వపడేలా చేశారు. తల్లి ప్రోద్బలంతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా మార్చేందుకు దర్శకుడు శేఖర్ కమ్ముల దగ్గరికి పంపారు. 'గోదావరి' చిత్రీకరణ జరుగుతున్న సమయమది. 'తర్వాత ప్రాజెక్టుకు కలిసి పనిచేద్దాం' అని శేఖర్ సమాధానం ఇచ్చారు. అప్పటివరకూ ఖాళీగా ఉండడం ఇష్టపడని నాగ్.. మంచు మనోజ్ హీరోగా తెరకెక్కిన 'నేను మీకు తెలుసా?'కు అసిస్టెంట్‌గా పనిచేశారు. తొలి సంపాదనగా రూ. 4 వేలు అందుకున్నారు. 'లీడర్', 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చిత్రాల విషయంలో శేఖర్.. అశ్విన్‌కు ఇచ్చినమాట నిలబెట్టుకున్నారు. నాగ్ చేసిన 'లీడర్' ట్రైలర్ కట్ శేఖర్‌కు నచ్చడంతో దాన్నే విడుదల చేయడం విశేషం. 'సినిమాని ఎంత స్నేహపూర్వక వాతావరణంలో తీయొచ్చో ఆయన వద్దే నేర్చుకున్నా' అని ఓ సందర్భంలో గురువును కొనియాడారు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' తర్వాత స్నేహితులతో కలిసి ఓ యాడ్ తీశారు. ఆ తర్వాత రూపొందించిన లఘు చిత్రం.. ఓ ఫిల్మ్‌ఫెస్టివల్ వరకు వెళ్లింది. అదే.. ఆయన వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని మార్చేసింది. ఆ షార్ట్‌ఫిల్మ్ చూసిన ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ కుమార్తెలు ప్రియాంక, స్వప్న సినిమా అవకాశాన్ని ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఆ క్రమంలో నాగ్ అశ్విన్ వారికి ఓ కథ వినిపించారు.

## అవినీతి సబ్జెక్టుగా భారతీయుడు-2

మూడో పార్ట్ కూడా ఉంటుందన్న శంకర్కమల్ హాసన్ హీరోగా దర్శకుడు శంకర్ రూపొందించిన చిత్రం 'భారతీయుడు'. 1996లో వచ్చిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా తాజాగా 'భారతీయుడు 2' ను తెరకెక్కించారు. జులై 12న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో మూవీ టీమ్ మీడియాతో ముచ్చటించి పలు విషయాలు పంచుకుంది.

కమల్ హాసన్ మాట్లాడుతూ.. 'అవినీతి విషయంలో అందరి మైండ్ సెట్ మారాలి. 'భారతీయుడు' మొదటి పార్ట్ వచ్చినప్పటికీ, ఇప్పటికీ ఈ విషయంలో ఏం మార్పు రాలేదు. ఈ సినిమా అంతా అవినీతి నేపథ్యంలోనే తెరకెక్కించారు. ఇది చూశాక చాలామంది ఆలోచిస్తారు. నేను గతంలో నటించిన కొన్ని చిత్రాల్లోని పాత్రలతో పోలిక ఉండడంతో 'భారతీయుడు'లో భాగం కావాలని అనుకోలేదు. అందుకే శంకర్ తనంతట తానుగా నన్ను తప్పించాలని కావాలనే నా రెమ్యునరేషన్ పెంచాను. కానీ, నిర్మాతలు నా డిమాండ్లు అంగీకరించడంతో ఆ చిత్రంలో నటించాను. శంకర్‌కు తన కథపై నమ్మకం ఎక్కువ. నాతోనే తీయాలని పట్టుబట్టి 'భారతీయుడు' తీశాడు. అతని పట్టుదల చూసి నేను ఆశ్చర్యపోయాను' అని చెప్పారు. తనను ఎన్నో ఏళ్లుగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. భారతీయుడు కథను మూడు పార్ట్‌లుగా ఎందుకు తీయాల్సివచ్చిందో శంకర్ వివరించారు. 'భారతీయుడు' మొదటి భాగం ఒక స్టేట్‌లో జరిగే కథ. 3.20 గంటల నిడివి. ఆ చిత్రం బ్లాక్‌బస్టర్ అయింది. ఇప్పుడు 'భారతీయుడు 2' దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన కథ. సినిమా ప్రారంభించినప్పుడు ఒక్క పార్ట్‌లోనే మొత్తం చూపించాలని భావించాం. కానీ, చిత్రీకరణ మొదలుపెట్టాక అన్ని సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయి. ఒక్క పార్ట్‌లోనే దీన్ని చూపించాలంటే కొన్ని సన్నివేశాలు కట్ చేయాలి. లేదంటే నిడివి తగ్గించాలి. అలా చేస్తే వాటిలో ఉన్న పవర్ పోతుంది. అన్ని సీన్స్ బాగా వచ్చాయి. ఎక్కడా బోర్ కొట్టడం లేదనిపించింది. అందుకే దీన్ని మరో పార్ట్ (భారతీయుడు 3) చేయాలని నిర్ణయించుకున్నాం' అని తెలిపారు.





## రాజమౌళి దంపతులకు అరుదైన గౌరవం



'ఆర్ఆర్ఆర్'తో ప్రపంచ వేదికపై తెలుగు సినిమా సత్తా చాటారు దర్శకధీరుడు రాజమౌళి. తాజాగా ఆయనతో పాటు ఆయన భార్య రమా రాజమౌళి కూడా అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఆస్కార్ అకాడమీలో చేరేందుకు ఆహ్వానం అందుకున్నారు. దర్శకుల కేటగిరిలో రాజమౌళి కాస్ట్యూమ్ డిజైనర్ జాబితాలో రమా రాజమౌళి ఈ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సంవత్సరం మొత్తం 57 దేశాల నుంచి 487 మంది సభ్యులకు ఆస్కార్ అకాడమీ ఆహ్వానం పంపింది. అందులో భారత్ నుంచి వీరిద్దరితో పాటు మరికొందరు సినీ ప్రముఖులు కూడా ఉన్నారు. షబానా అజ్మి, రితేశ్ సిద్వానీ, రవి వర్మన్ తదితరులు అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ అండ్ ఆర్ట్స్ ఆహ్వానం అందుకున్న వారిలో ఉన్నారు. తాజాగా దీనిపై అకాడమీ పోస్ట్ చేస్తూ.. 'ఈ సంవత్సరం కొత్త సభ్యులకు ఆహ్వానం పంపుతున్నందుకు సంతోషిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన కళాకారులు, నిపుణులకు అకాడమీ స్వాగతం పలుకుతోంది' అని పేర్కొంది. ఇక టాలీవుడ్ నుంచి గతేడాది కొందరు ప్రముఖులు ఈ అకాడమీలో చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆర్ఆర్ఆర్‌లో నటించిన రామ్ చరణ్, ఎన్టీఆర్‌లతో పాటు కీరవాణి, సెంథిల్‌కుమార్ గతంలో ఈ అకాడమీలో సభ్యత్వం సాధించారు.

## జాన్వీ కపూర్‌కి చెమటలు పట్టించారు..!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్ మరియు టాలీవుడ్ లో వరుస సినిమాలతో బిజీగా ఉంది. బాలీవుడ్ లో ఇటీవల ఒక సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన జాన్వీ కపూర్ వరుస షూటింగ్స్ కారణంగా ట్రావెల్ చేస్తూనే ఉంటుంది.ఇటీవల ముంబై ఎయిర్ పోర్ట్ లో జాన్వీ కపూర్ కి చేదు అనుభవం ఎదురైంది. అక్కడ తన గార్డ్స్ లేక పోవడంతో పాటు, ఎయిర్ పోర్ట్ సిబ్బంది కూడా లేని కారణంగా ఫ్యాన్స్ పెద్ద ఎత్తున ఆమెను చుట్టుముట్టారు. సెల్ఫీ లు అంటూ ఆమెను ఇబ్బంది పెట్టడంతో పాటు ఫిజికల్ గా ఇబ్బంది పెట్టారట.అందుకు సంబంధించిన ఫోటోలు మరియు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సాధారణంగా సెలబ్రిటీలకు ఇలాంటి పరిస్థితులు కామన్ గా జరుగుతూ ఉంటాయి. అయితే ఎయిర్ పోర్ట్ లో ఇలా జరగడం మాత్రం చాలా అరుదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.కొన్ని నిమిషాల పాటు జాన్వీ కపూర్ ను చుట్టు ముట్టిన జనాలు ఆమెను అక్కడ నుంచి అడుగు కదలకుండా చేశారట. దాంతో జాన్వీ కపూర్ కి ముచ్చెమటలు పట్టి, అక్కడ నుంచి ఎలా బయట పడాలో తెలియక గుండె జారి పోయినంత పనైందట.

ఈ విషయాన్ని జాన్వీ సన్నిహితుల వద్ద వెల్లడించిందట.ఇకపై జాన్వీ కపూర్ ఒంటరిగా ఎయిర్ పోర్ట్ కి వెళ్ల కూడదని కూ డా నిర్ణయించుకుందట. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే బాలీవుడ్ లో ప్రస్తుతం రెండు సినిమాలను చేస్తుంది. మరో వైపు టాలీవుడ్ లో ఈ అమ్మడు రెండు సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే.హిందీ సినిమాల కంటే కూడా ఎక్కువగా అందరి దృష్టి టాలీవుడ్ సినిమాల మీద ఉంది. మొదటిది ఎన్టీఆర్ తో చేస్తున్న దేవర కాగా, రెండోది చరణ్ కు జోడీగా బుచ్చిబాబు దర్శకత్వంలో చేస్తున్న సినిమా. ఈ రెండు సినిమాలు జాన్వీ కపూర్ ను పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ గా నిలపడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.